E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 05 -06-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



జులై 21 నుంచి పార్లమెంటు వర్షా కాల సమావేశాలు » 3లో



# విజయోత్సవంలో విషాదం
## చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట

తొక్కిసలాటలో 11 మంది మృతి

ఆర్‌సీబీ విజయోత్సవ సభలో అపశ్రుతి
ఘటనలో 50 మందికిపైగా గాయాలు
ఈ ఘటన కలిచివేసిందన్న కోహ్లీ
రూ.5 లక్షల నష్టపరిహారం..



ఈ కబురు ,బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమంలో పెను విషాదం చోటు చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతిచెందారు. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు భారీగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు.

తరువాయి 2లో

అదుపు చేయలేక చేతులెత్తేసిన బెంటగళూరు పోలీసులు



## లాభాల్లో
ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 24600ఎగువకు నిఫ్టీ
» 4లో

ప్రియమైన ప్రత్యర్థిపై ఘనమైన విజయం
» 6లో



డిసెంబరు 5న రాజాసాబ్
» 5లో



ఆర్సీబీకి రూ.20 కోట్లు, పంజాబ్ కింగ్స్‌కు రూ.12.5 కోట్లు!
» 6లో



## రిటైర్మెంట్
వయసు పెంపుపై సమాలోచనలు.. లాభనష్టాలపై సర్కార్ చర్చ!



ఈ కబురు: ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై రాష్ట్ర సర్కార్ సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ఏడాది పెంచితే ఎలా ఉంటుంది? దాంతో ఏ మేరకు ఆర్థికంగా వెసులుబాటు కలుగనుంది? అలాగే రాజకీయంగా ఎలాంటి మైలేజ్ వస్తుంది?

తరువాయి 2లో

## తెలంగాణ టెట్2025 పరీక్షల షెడ్యూల్ విడుదల



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో టెట్-2025 పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది.

» 2లో

# దేశంలో తొలిసారిగా
## జన గణనతోపాటు కుల గణన

- 2027 ఫిబ్రవరిలో జన, కులగణన
- రెఫరెన్స్ తేదీగా నిర్ణయించింది.
- అదే నెలలో పూర్తి చేయాలని నిర్ణయం
- తొలి దశలో 2026లోనే హౌస్ లిస్టింగ్
- రెండో దశలో జనాభా లెక్కల సేకరణ
- మంచు ప్రభావిత ప్రాంతాల్లో అంతకు ముందే..
- ఈ నెల 16న గెజిట్ నోటిఫికేషన్
- కేంద్ర హోంశాఖ ప్రకటన
- రూ.13,000 కోట్ల వ్యయ అంచనా
- జన గణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన!
- హిమాలయ పర్వత ప్రాంతాల్లో 2026 అక్టోబర్ 1నే శ్రీకారం
- కేంద్ర హోంశాఖ అధికారిక ప్రకటన



*దేశ 16వ జన గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటే కుల గణననూ చేపట్టి అదే నెల చివరి నాటికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1ని*

ఈ కబురు, దిల్లీ: దేశ 16వ జన గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటే కుల గణననూ చేపట్టి అదే నెల చివరి నాటికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1ని రెఫరెన్స్ తేదీగా నిర్ణయించింది. అంటే ముందు రోజైన ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి 12 గంటలకల్లా జన గణన పూర్తి కానుంది. అంతకుముందే 2026 ఏప్రిల్‌లోనే తొలి విడత హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. మంచు ప్రభావిత ప్రాంతాలైన లద్ధాఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 సెప్టెంబరు ఆఖరు నాటికే జన గణన పూర్తి కానుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబరు 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించింది. జనాభా లెక్కల చట్టం1948లోని (సెన్సస్ యాక్ట్1948) సెక్షన్ 3 నిబంధనల ప్రకారం.. ఈ వివరాలను ఈ నెల 16న అధికారిక గెజిట్‌లో ప్రచురించనున్నట్లు కేంద్ర హోంశాఖ బుధవారం వెల్లడించింది.

వాస్తవానికి 2021లోనే జన గణన జరగాల్సి ఉంది. కొవిడ్ మహమ్మారి కారణంగా అది వాయిదా పడింది. ఇన్నాళ్లకు మళ్లీ కొత్త షెడ్యూలు వచ్చింది. పదహారు ఏళ్ల తర్వాత జన గణన జరగనుంది. ఇదివరకు కేవలం జనాభా లెక్కలు, ఎస్సీ, ఎస్టీ కులాల వివరాల సేకరణకే ప్రభుత్వం పరిమితమైంది. ఇప్పుడు తొలిసారిగా ఓబీసీ కులాల వివరాలనూ ప్రత్యేకంగా సేకరించనుంది. కుల గణనకు ఏప్రిల్ 30వ తేదీన జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

జనాభా లెక్కలతోపాటే జాతీయ జనాభా రిజిస్టరును (ఎన్‌పీఆర్) అప్‌డేట్ చేస్తారా లేదా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. 2020లో జన గణన సమయంలో మాత్రం ఎన్‌పీఆర్ అప్‌డేట్ వెంటనే జరుగుతుందని పేర్కొంది. కానీ కొవిడ్‌తో జన గణనే జరగలేదు.

2027లో జన గణనకు రూ.13,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. 2021లో చేపట్టాలనుకున్న జన గణనకు 2019 డిసెంబరు 24న జరిగిన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జన గణనకు రూ.8,754 కోట్లు, ఎన్‌పీఆర్ అప్‌డేట్‌కు రూ.3,941 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది.

జన గణన రిజిస్ట్రార్ జనరల్‌కు కేంద్ర ప్రభుత్వం.. 202526 బడ్జెట్‌లో కేవలం రూ.574 కోట్లే కేటాయించింది. అయితే జనాభా లెక్కల సేకరణకు నిధుల కేటాయింపు పెద్ద సమస్య కాదని అధికారులు అంటున్నారు.

దాదాపు 30 లక్షల మంది సిబ్బంది ఈ జన గణనలో పాలుపంచుకుంటారు.

2011 జనాభా లెక్కల ప్రకారం..దేశ జనాభా 121.01 కోట్లు. ఇందులో 62.3 కోట్ల మంది (51.54%) పురుషులు. 58.6 కోట్ల మంది (48.46%) మహిళలు.

బ్రిటిష్ హయాంలో 1881 నుంచి 1931 వరకూ కుల గణన జరిగింది. ఆ తర్వాత 2011లో యూపీఏ హయాంలో సామాజిక, ఆర్థిక, కుల గణన జరిగింది. అయితే ఆ వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు.

తరువాయి 2లో

## ఇకపై అంగన్వాడీ కేంద్రాల్లో
ఎగ్ బిర్యానీ.. సీతక్క కీలక ప్రకటన



ఈ కబురు: చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న విద్యను, ఆరోగ్య భద్రతను మెరుగుపరుచుకునే లక్ష్యంతో మనమంతా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.

» 2లో

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత: డిప్యూటీ సీఎం భట్టి
» 3లో



ఈ కబురు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా సర్కార్ బాధ్యత , సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్.. కేసీఆర్‌కు నోటీసులిస్తారా?

- 16 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు పెంచినందుకా ఈ నోటీసులు?
- కాళేశ్వరం కమిషన్ కాదు... అది కాంగ్రెస్ కమిషన్
- ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఈ కబురు:, హైదరాబాద్/కవాడిగూడ: తెలంగాణ సస్య శ్యామలం కావాలని 16 టీఎంసీల నుంచి కాళేశ్వరం ప్రాజెక్టును 141 టీఎంసీలకు పెంచినందుకా మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడమంటే యావత్ తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్టేనని ధ్వజమెత్తారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్‌తో నోటీసులు జారీ చేయించిన కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్ అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ అని విమర్శించారు. కమిషన్‌పై మాకు నమ్మకం ఉందని, కాంగ్రెస్ పార్టీపై ఎటువంటి విశ్వాసం లేదన్నారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జాగృతి కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత ప్రసంగించారు. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, కేసీఆర్‌ను బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేశారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని, 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్‌హౌస్‌లు నిర్మించిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు.

తరువాయి 2లో



## ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ ఆయుధాలే కీలకం.. ప్రధాని మోడీ
» 3లో

## తక్షణ శాంతి అసాధ్యం
»3లో



మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ టెట్2025 పరీక్షల షెడ్యూల్ విడుదల



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో టెట్-2025 పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు రెండు సెక్షన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి.ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పాఠశాల విద్యాశాఖ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. కాగా, ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి టెట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

# విజయోత్సవంలో విషాదం

## చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట



అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయపడ్డారు. మృతుల్లో పలువురు మహిళలు సైతం ఉన్నారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

### ప్రముఖుల దిగ్భ్రాంతి

తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ హృదయ విదారక ఘటనలో ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..

ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్‌కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

### రూ.5 లక్షల నష్టపరిహారం..

'జట్టు తిరిగొస్తుందన్న ఆనందంలో ప్రజలు భారీగా రావడంతో జరిగిన ఘోరం గురించి మీడియా ద్వారా తెలుసుకొని చాలా బాధపడ్డాం. ప్రతి ఒక్కరి భద్రతా మాకు చాలా ముఖ్యం. ఫ్యాన్స్ మరణాలపై తీవ్రమైన దుఃఖాన్ని మిగిల్చాయి. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. విషయం తెలియగానే కార్యక్రమాన్ని వేగంగా పూర్తిచేసి, స్థానిక అధికారుల సూచనలు పాటించాం. ఫ్యాన్స్ అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాం' అని ఆర్సీబీ పేర్కొంది. అలాగే మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లిస్తున్నట్లు ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా ప్రకటించాయి.

మాకు అసలు తెలియదు: ఐపీఎల్ చైర్మన్

అసలు బెంగళూరు కార్యక్రమం ఎవరు నిర్వహించారని తెలుసుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ అన్నారు. బీసీసీఐ, ఐపీఎల్ యాజమాన్యానికి ఈ కార్యక్రమంతో జరుగుతున్న విషయం కూడా తెలియదని, తమ వరకు సెలబ్రేషన్స్ జూన్ 3వ తేదీనే ముగిశాయని ఆయన స్పష్టం చేశారు. విషయం తెలియగానే స్టేడియంలో ఉన్న అధికారులతో తాను మాట్లాడానని, అయితే బయట జరిగిన ఘోరం గురించి వారికి తెలియదని ధుమాల్ తెలిపారు. 'లోపల ఉన్న అధికారులను విషయం తెలియలేదు. నేను చెప్పగానే కార్యక్రమం వెంటనే ముగించేస్తామని చెప్పారు. ఇది చాలా బాధాకరం. అసలు ఈ కార్యక్రమం ప్లాన్ చేశారనే విషయం కూడా మాకు తెలీదు. మృతులకు మా ప్రగాఢ సానుభూతి' అని ఆయన చెప్పుకొచ్చారు.

### జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాల్సింది: సైకియా

అదే సమయంలో బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా మాట్లాడుతూ.. 'ఐపీఎల్ ఘనంగా ముగిసిన తర్వాత ఇంత దారుణం జరగడం చాలా బాధాకరం. గతంలో చాలాసార్లు ఇలాంటి సెలబ్రేషన్స్ జరిగాయి. గతేడాది కోల్‌కతాలో కేకేఆర్ ర్యాలీ, టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పుడు ముంబైలో నిర్వహించిన భారీ ర్యాలీ సజావుగానే సాగాయి. పోలీసులు, స్థానిక అధికారులు కలిసి పనిచేసి ఈ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూశారు. ఐపీఎల్ ఫైనల్‌లో కూడా లక్షా 20 వేల మంది వచ్చారు. కానీ బీసీసీఐ టీం ఈ పరిస్థితిని కూడా చక్కగా హ్యాండిల్ చేసింది. నిర్వాహకులు కార్యక్రమాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేయాల్సింది. మరణించిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ఈ స్థాయిలో విక్టరీ సెలబ్రేషన్స్ ప్లాన్ చేసినప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడో లోపం జరగడం వల్లనే ఈ దారుణం జరిగింది' అని సైకియా చెప్పారు. అయితే స్టేడియం బయట తొక్కిసలాటలో ఫ్యాన్స్ చనిపోయినా.. సెలబ్రేషన్స్ కార్యక్రమం కొనసాగించినందుకు ఆర్సీబీపై కూడా కొందరు విమర్శలు చేస్తున్నారు.

### ప్లీజ్ అందరూ క్షేమంగా ఉండండి: ఆర్సీబీ.. ఈ ఘటన కలిచివేసిందన్న కోహ్లీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 18వ సీజన్ విజేతగా నిలిచింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదీస్తూ ఛాంపియన్‌గా మారిన ఆర్సీబీకి ఘన స్వాగతం పలికేందుకు కర్ణాటక ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే భారీ ఎత్తున అభిమానులు రావడంతో తొక్కిసలాట చోటు చేసుకుని 11 మంది మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై సర్వత్రా తీవ్ర విచారం వ్యక్తమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ క్రికెటర్ సచిన్ సహా పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని కర్ణాటక ప్రభుత్వం కమిటీని కూడా నియమించింది. ఈ ఘటనపై రాయల్ ఛాలెంజర్స్ మేనేజ్‌మెంట్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. అభిమానులు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు విరాట్ కోహ్లీ ఈ ఘటనపై స్పందించాడు. తొక్కిసలాట ఘటనతో మాటలు రావట్లేదని, తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. 'తొక్కిసలాట వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాం. మా అభిమానులందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం. మీడియాలో వచ్చిన కథనాలతో ఈ ఘటన గురించి మాకు తెలిసింది. అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. మాకు ప్రతి ఒక్కరి క్షేమం అత్యంత కీలకం. దీని గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలను రద్దు చేసుకున్నాం. బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. స్థానిక అధికారులకు మా పూర్తి సహకారం అందిస్తాం. ఈ సందర్భంగా మాకు మద్దతుగా నిలిచే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. అందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాం'' అని ఆర్సీబీ పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

# దేశంలో తొలిసారిగా

## జన గణనతోపాటు కుల గణన



**తెలంగాణ, బిహార్‌లు సొంతంగా కుల గణన ఇప్పటికే నిర్వహించాయి. అయితే కేంద్రం ఈ రాష్ట్రాల్లోనూ మళ్లీ నిర్వహించనుంది.**

చివరి జన గణనను 2011లో రెండు దశల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించింది.

నియోజకవర్గాల పునర్విభజన కోసమే!

రాజ్యాంగపరమైన ఇబ్బందులు తలెత్తకుండా దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసమే కేంద్రం జనగణనను 2027లో నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2026 తర్వాత జనాభా లెక్కలు సేకరించి..ప్రచురించిన తర్వాతే సీట్ల సర్దుబాటు చేయాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170 చెబుతున్నందున ఈ దిశగా అడుగులేస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి జనాభా లెక్కల సేకరణంతా ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ రూపంలోనే పూర్తి చేయాలని నిర్ణయించినందున తుది లెక్కల ప్రచురణ వేగంగా పూర్తయ్యే అవకాశముంది. ఉమ్మడి ఏపీ విభజనచట్టంలోని సెక్షన్ 26లో.. ఏపీ అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ స్థానాలను 119 నుంచి 153కు పెంచాలని పేర్కొన్నారు. అయితే ఇది ఆర్టికల్ 170కి లోబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ ఆర్టికల్‌లో 2026 తర్వాత జనాభా లెక్కల సేకరణ పూర్తయ్యాకే పునర్విభజన చేపట్టాలన్న నిబంధన ఉండటంతో కేంద్రం ఈ విషయంలో ముందుకెళ్లలేదు. దీనిపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఇటీవలే విచారణ ముగించి తీర్పు రిజర్వు చేసింది.3 డజన్ల ప్రశ్నలు: జనగణన రెండు దశల్లో కేంద్రం ప్రజల నుంచి విభిన్న అంశాలపై వివరాలను సేకరించనుంది. ఇందుకోసం దాదాపు 3 డజన్ల ప్రశ్నలు వేయనుంది. వీటి ఆధారంగానే సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేయనుంది.

### జనాభా అంచనాలివీ..

2020 జులైలో జన గణన విభాగం విడుదల చేసిన అంచనాల ప్రకారం.. 2027 నాటికి దేశ జనాభా దేశ జనాభా 143,64,78,000. వివిధ రాష్ట్రాల జన సంఖ్య అంచనా వివరాలు

### 16 ఏళ్ల తర్వాత మళ్లీ జన గణన

సెన్సెస్ యాక్ట్-1948, సెన్సెస్ రూల్స్-1990 ప్రకారం దేశంలో ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. చివరిసారిగా 2011లో జన గణన జరిగింది. దేశంలో 121 కోట్లకు పైగా జనాభా ఉన్నట్లు అప్పట్లో తేలింది. జనాభా వృద్ధి రేటు 17.7 శాతంగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. 2021లో మళ్లీ జన గణన జరగాల్సి ఉండగా కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ వల్ల అనివార్యంగా వాయిదా పడింది. 16 ఏళ్ల తర్వాత మళ్లీ జనాభా లెక్కల సేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈసారి జరిగే జన గణనకు విశేషమైన ప్రాధాన్యం ఉంది. కులాల జనాభా లెక్కలు కూడా సేకరించబోతున్నారు. కుల గణన కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. బిహార్, తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా కుల గణన నిర్వహించాయి. దీంతో దేశమంతటా ఈ ప్రక్రియ ప్రారంభించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. కుల గణన వివరాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తే ఆయా వర్గాలకు మేలు జరుగుతుందని మేధావులు, నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కుల గణనకు ఆమోదం తెలిపింది.

### 1971 నుంచి లోక్‌సభ సీట్ల సంఖ్య యథాతథం

దేశంలో లోక్‌సభ నియోజకవర్గాలు, రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన వ్యవహారం పెండింగ్‌లో ఉంది. జన గణన పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. తాజా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులు మారే అవకాశం ఉంది. అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. అయితే, నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందా? లేదా? అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రాజ్యాంగం ప్రకారం.. జనాభా లెక్కల సేకరణ జరిగిన ప్రతిసారీ నియోజకవర్గాల సంఖ్య, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు చేయాలి. 1976 నుంచి నియోజకవర్గాల సంఖ్యలో ఎలాంటి మార్పులు చేయకుండా నిలిపివేశారు. జనాభాను నియంత్రణను ప్రోత్సహించాలన్నదే దీని అసలు ఉద్దేశం. వాస్తవానికి నియోజకవర్గాల సంఖ్య పెంపుపై నిషేధం 2001 దాకానే అమలు కావాలి. కానీ, 2026 దాకా పొడిగించారు. 2001 తర్వాత నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ, ఎస్టీల రిజర్వ్‌డ్ స్థానాల్లో మార్పులు జరిగినప్పటికీ మొత్తం నియోజకవర్గాల సంఖ్య మారలేదు. ఈ సంఖ్య 1971 నుంచి 543గానే కొనసాగుతోంది. అప్పటితో పోలిస్తే దేశ జనాభా రెండు రెట్లకు పైగానే పెరిగింది. నియోజకవర్గాల సంఖ్యలో మాత్రం మార్పులేదు.

### దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

మరోవైపు జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య పెంచితే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఉత్తరాదిన జనాభా పెరగడం, దక్షిణాదిన తగ్గడమే ఇందుకు కారణం. ఇప్పుడున్న నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా కొనసాగించి జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు 26 సీట్లు కోల్పోతాయని, ఉత్తరాది రాష్ట్రాలకు అదనంగా 31 సీట్లు లభిస్తాయని అంచనా. ఒకవేళ 2019లో ప్రతిపాదించినట్లుగా లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 848కు పెంచి, పునర్విభజన చేపట్టినా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయమే జరుగుతుంది.

### తొలి దశలో అడిగే ప్రశ్నలివే..

**ఇంటి నంబరు.**

**ఇంటి ఫ్లోర్, గోడలు, పైకప్పు నిర్మాణంలో ఏ మెటీరియల్ ఉపయోగించారు.**

**ఇంటి పరిస్థితి ఎలా ఉంది..**

**కుటుంబంలో ఎంత మంది ఉంటున్నారు.. ఇంటి పెద్ద పేరు, వారు ఆడా.. మగా.**

**ఇంటి పెద్ద కులం (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ).**

**ఇంటి యాజమాన్య వివరాలు.**

**ఇంట్లో ఉంటున్న నివాస గదులెన్ని..**

**ఆ ఇంట్లో ఉంటున్న వివాహమైన జంటలు**

**తాగు నీటికి ప్రధాన వనరు ఏంటి..**

**విద్యుత్తు, మరుగుదొడ్డి సౌకర్యాలు ఉన్నాయా.. ఎలాంటి మరుగుదొడ్డి వాడుతున్నారు..**

**వృథా నీరు వెళ్లడానికి కనెక్షన్ ఉందా..**

**ఇంటి పరిధిలోనే స్నానాల గది ఉందా..**

**వంటశాల లభ్యత, వంటకు ఉపయోగిస్తున్న ఇంధనం.**

**ఎలాంటి తృణ ధాన్యాలను వినియోగిస్తున్నారు..**

**రేడియో/టీవీ/ఫోన్/మొబైల్/ఇంటర్‌నెట్ సౌకర్యం ఉందా..**

**కంప్యూటర్/ల్యాప్‌టాప్ వినియోగిస్తున్నారా..**

**కారు, జీప్, వ్యాన్, స్కూటర్, మోటార్ సైకిల్, మోపెడ్ ఉందా..**

**బ్యాంకింగ్ సేవలను వాడుకుంటున్నారా..**

**రెండోదశలో..**

**వ్యక్తి పేరు, ఇంటి యజమానితో సంబంధం, లింగం, పుట్టిన తేదీ, వయసు, జన్మ స్థలం, వివాహ స్థితి, ఏ వయసులో వివాహం చేసుకున్నారు, ఎంతమంది పిల్లలున్నారు.**

**మతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, వైకల్యం,**

మొదటి పేజీ తరువాయి

# కాంగ్రెస్ నాయకులారా ఖబడ్దార్.. కేసీఆర్‌కు నోటీసులిస్తారా?



కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని, 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్‌హౌస్‌లు నిర్మించిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని డిమాండ్ చేశారు.

**చంద్రబాబు జలదోపిడీ చేసినా బీజేపీ ప్రశ్నించడం లేదు**

ఏపీ సీఎం చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జలదోపిడీ చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో ఉన్న ఈటల రాజేందర్ కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదని, తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి

# రిటైర్మెంట్ వయసు పెంపుపై సమాలోచనలు.. లాభనష్టాలపై సర్కార్ చర్చ!



అనే అంశాలపై ప్రభుత్వ వర్గాలు ఆరా తీస్తున్నట్టు సమాచారం. అందుకోసం ఆర్థిక శాఖ నుంచి ఈ ఏడాది రిటైర్డ్ కానున్న ఉద్యోగుల జాబితా, వారికి చెల్లించాల్సిన నిధుల మొత్తం వివరాలను తెప్పించుకుని పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఉన్నట్టుండి ఈ అంశంపై చర్చించడానికి ప్రధాన కారణం సర్కారును వెంటాడుతున్న ఆర్థిక వనరుల కొరతేనని తెలుస్తున్నది. ఇప్పటికే రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించడం కష్టంగా మారింది. ఇలాంటి సమయంలో మరింత మంది ఉద్యోగ విరమణ పొందితే వారికి ఆర్థిక ప్రయోజనాలు అందించగలమా? లేదా? అనే కోణంలో చర్చిస్తున్నట్టు తెలుస్తున్నది.

### రూ.9 వేల కోట్ల వెసులుబాటు

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 61 ఏండ్లు. దీన్ని మరో ఏడాది పాటు అంటే 62 ఏండ్లకు పెంచితే ఎలా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఒకవేళ ఉద్యోగ విరమణ వయస్సు పెంచితే ప్రభుత్వానికి చేకూరే లాభనష్టాల కోణంలోనూ చర్చిస్తున్నట్లు తెలిసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా సగటున 800 మంది ఉద్యోగులు, ఏడాదిలో సుమారు 9 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ కానున్నారు. వీరందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దాదాపు రూ.9 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుతం అంతటి ఆర్థిక వనరులు సమకూరుతాయా? లేదా? అని సర్కారు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. ఒకవేళ వయస్సును పెంచితే మాత్రం ఒక ఏడాది పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ, ఆ తరువాత ఏడాది నుంచి యథావిధిగా రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించక తప్పదు.

### ఇప్పటికే రూ.8 వేల కోట్లు పెండింగ్

కేసీఆర్ హయాంలో ఎంప్లాయిస్ ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏండ్లకు పెంచడంతో రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించే ఇబ్బందులు రాలేదు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 ఏప్రిల్ నుంచి ఉద్యోగుల 'విరమణ' మొదలైంది. దీనితో ఇప్పటివరకు దాదాపు 12 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. వారందరికీ చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఒక్కొక్కరికి సగటున రూ.కోటి వరకు ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆర్థిక వనరుల కొరత కారణంగా 'విరమణ' చేసిన ఉద్యోగులకు సుమారు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. వారందరికీ ప్రతి నెలా కొంత మొత్తంలో చెల్లించాలని ప్లానింగ్ చేశారు. కానీ, ఇతర సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించాల్సి రావడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం సమస్యగా మారిందని అధికారులు అంటున్నారు.

రాజకీయ ప్రయోజనం ఉంటుందా?

ఉద్యోగ విరమణ వయస్సును 61 నుంచి 62 ఏండ్లకు పెంచితే ఉద్యోగులు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే కోణంలోనూ ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఉద్యోగులు తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు (డీఏ, సరెండర్ లీవ్స్, పీఎఫ్, మెడికల్ బిల్స్) అందడం లేదని గుర్రుగా ఉన్నారు. మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులు సైతం తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో ఏడాది పాటు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలా? వద్దా? అని ప్రభుత్వం తర్జన భర్జన పడుతున్నట్టు సెక్రెటేరియట్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

మొదటి పేజీ తరువాయి

# ఇకపై అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ.. సీతక్క కీలక ప్రకటన

ఈ కబురు: చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న విద్యను, ఆరోగ్య భద్రతను మెరుగుపరుచుకునే లక్ష్యంతో మనమంతా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామని వారంలో ఒకటి రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూ మార్చబోతున్నట్లు చెప్పారు. ఇవాళ హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమధన సదస్సులో మాట్లాడిన సీతక్క..అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు నేల మీద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వారి ఇబ్బందులను తొలగించేందుకు అంగన్వాడి కేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామన్నారు. అంగన్వాడి టీచర్లు ప్రస్తుతం వినియోగిస్తున్న మొబైల్ స్థానంలో అధునాతన మొబైల్స్ ను త్వరలో అందజేస్తామన్నారు అంగన్ వాడీ కేంద్రాల్లోనూ బడి గంట తరహాలో బెల్సును తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నామని ఇలా గంటను మోగించడం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం క్రమశిక్షణ పెరుగుతాయని టీచర్లు, హెల్పర్లు సకాలంలో వచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. మీ అనుభవాలు, ఆలోచనలు, ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను తెలుసుకునేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని మీరు వ్యక్తపరిచిన అభిప్రాయాలను క్రోడీకరించి, నిపుణులు మేధావులతో చర్చించి అంగన్వాడీల సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ సమ్మెలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పని ఒత్తిడిని తగ్గించేందుకు త్వరలో 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా నియామకాల ప్రక్రియ కాస్త ఆలస్యమైందని త్వరలో ఆ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అంగన్వాడి కేంద్రాలను అక్షర జ్ఞానానికి, పోషకాహారానికి, ఆరోగ్యానికి, ఆటవిడుపుకు, మేధో వికాసానికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్లే స్కూల్ లకు దీటుగా అంగన్వాడీలను సిద్ధం చేసి తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని అన్నారు. చిన్నారుల చదువు, సౌకర్యం, ఆటవిడుపు కోసం 57 రకాల వస్తువులను అంగన్వాడీలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలకు నమ్మకం కలిగించేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. అంగన్వాడీలు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సెల్ఫీ విత్ అంగన్వాడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్వాడీల్లో అడ్మిషన్లు పెంచేందుకు అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే సప్లయర్స్ ను బ్లాక్ లిస్టులో పెడుతున్నామని హెచ్చరించారు. కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున వయోవృద్ధులకు, ట్రాన్స్ జెండర్ ల ఆత్మగౌరవాన్నీ పెంపొందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవనాలను ఒకే మోడల్ లో నిర్మించాలని సూచించారు



## పారిశుధ్య కార్మికులకు నిత్యవసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్యక్రమానికి హాజరైన పారిశుధ్య కార్మికులు

### సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల జిహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. అమెజాన్ కంపెనీ సహకారంతో దాదాపు 200 మంది పారిశుధ్య కార్మికులకు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి నిత్యవసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రత కోసం రోజూ తెల్లవారుజాము నుంచే కష్టపడుతున్నారని అన్నారు. నగరం మొత్తం నిద్రపోతున్న వేళ పారిశుధ్య కార్మికులు మాత్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెమటను చిందిస్తున్నారని అన్నారు. వారివల్లే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని అన్నారు. పారిశుధ్య కార్మికులకు సహకారం అందించేందుకు అమెజాన్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని, కార్మికుల సేవ కోసం మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హనుమంత్ నాయక్, సుమన్, రాజు, శ్రీను, యాదయ్య, గోవింద్ జిహెచ్ఎంసీ సిబ్బంది భారత, కిస్తయ్య, మల్లేష్,,అమెజాన్ సంస్థ ప్రతినిధులు,పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శృతిమించిన ఆర్సీబీ అభిమానుల గెలుపు సంబరాలు



కొండాపూర్ రహదారిపై అభిమానుల సంబరాలు







కొండాపూర్ రహదారిపై అభిమానుల సంబరాలు

- గచ్చిబౌలిలో ఇద్దరు యువకులపై కేసు నమోదు
- బస్సు ఎక్కి విధులను అడ్డుకున్నారని ఆర్టీసీ పిర్యాదు

ఈకబురు, శేరిలింగంపల్లి : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు( ఆర్సీబీ ) ట్రోఫీ చేజిక్కించుకోవడంతో నగరంలో అభిమానులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. కాగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్సీబీ అభిమానుల గెలుపు సంబరాలు శృతిమించాయి. హైటెక్ సిటీ పరిధిలోని కొండాపూర్ చౌరస్తా వద్దకు పెద్దఎత్తున చేరుకున్న అభిమానులు సంబరాల్లో మునిగితేలారు. కొందరు అభిమానులు శృతి మించి చేసిన సంబరాలు తోటి ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టించాయి. కొండాపూర్ సిగ్నల్ వద్ద దాదాపు 150 మంది యువకులు బాణసంచా కాల్చుతూ, వాహనాలకు దారివ్వకుండా హోల్ చల్ చేస్తూ ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపోకు చెందిన రూట్ నెంబర్ 10హెచ్ బస్సు (టీజీ10టి1469) సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ క్రాస్ రోడ్డుకు చేరుకుంది. అక్కడ బస్సు యూటర్న్ తీసుకోవాల్సి ఉండగా గెలుపు సంబరాలు చేసుకుంటున్న ఆర్సీబీ అభిమానులు రోడ్డుపై తిష్టవేసి బస్సు కు అడ్డు తగిలారు. చాలాసేపు హరన్ కొట్టినా పక్కకు జరగని ఆర్సీబీ అభిమానులు రహదారిపై వాహనాలను ముందుకు కదలినివ్వలేదు. ఇదే సమయంలో మరింత రెచ్చిపోయిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు ఆర్టీసీ బస్సు మీదకు ఎక్కి బస్సు ముందుకు కదలకుండా డ్రైవర్ ను అడ్డుకున్నారు.. రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కల్గించడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. బాణాసంచా కాల్చుతూ ఆర్సీబీ అభిమానులు వాహనాలకు దారి ఇవ్వకపోవడంతో గ్రీన్ సిగ్నల్ ఉన్నా వాహనాలు ముందుకు కదలేని పరిస్థితి వచ్చింది. అర్టీసీ బస్సు ముందుకు కదలకుండా ఇద్దరు గుర్తు తెలియని యువకులు తన విధులకు ఆటంకం కల్గించారని డ్రైవర్ పోచయ్య గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



సర్కిల్ లో కొత్తగా అభివృద్ధి చేసిన గార్డెన్

## నానక్‌రామ్‌గూడ సర్కిల్ ...... ఇకపై స్టార్ సర్కిల్......

ఈ-కబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో నానక్‌రామ్‌గూడ జంక్షన్‌లోని సర్కిల్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు స్టార్ హాస్పిటల్స్ ముందుకొచ్చింది. ఈ భాగస్వామ్యంతో భాగంగా రౌండ్ అబౌట్ కు "స్టార్ సర్కిల్" అనే పేరు పెట్టి, అందం, పచ్చదనం కలగలిపిన ఒక హరిత ప్రదేశంగా తీర్చిదిద్దారు. మధ్యలో ప్రత్యేకంగా రూపొందించిన స్టార్ ఆకారపు శిల్పం ఈ ప్రదేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చుట్టూ పుష్పాలు, మొక్కలు, చిన్న తోటలు ఏర్పాటు చేయబడిన ఈ ప్రాంతం, ప్రయాణికులకు ప్రశాంతతనిచ్చే కొత్త కోణంగా నిలుస్తోంది. అభివృద్ధి చేసిన గార్డెన్ ను, కొత్తగా ఏర్పాటు చేసిన శిల్పాన్ని బుధవారం స్టార్ హాస్పిటల్స్ సీనియర్ కార్డియోథోరాసిక్ సర్జన్ & చైర్మన్ డాక్టర్ గోపిచంద్ మన్నం, హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ కె. శ్రీనివాస్ లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.



నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ ఆకారపు శిల్పాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## జులై 21 నుంచి పార్లమెంటు వర్షా కాల సమావేశాలు



**పార్లమెంటు వర్షా కాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు.**

ఈ కబురు,ఢిల్లీ: పార్లమెంటు వర్షా కాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ సమావేశ తేదీలను నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ వర్షా కాల సమావేశాల్లో అన్ని ముఖ్యమైన అంశాలను పార్లమెంటు నిబంధనల ప్రకారం చర్చిస్తామని రిజిజు తెలిపారు. అయితే 47 రోజుల ముందే పార్లమెంటు సమావేశాల తేదీలను ప్రకటించడంపై కాంగ్రెస్ స్పందించింది. పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలన్న ఇండియా కూటమి డిమాండ్లకు భయపడి ఈ సమావేశ తేదీలను ముందుగానే ప్రకటించారని విమర్శలు గుప్పించింది.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత: డిప్యూటీ సీఎం భట్టి



ఈ కబురు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా సర్కార్ బాధ్యత ,సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించిందని, వారి వద్ద స్వీకరించిన సమాచారాన్ని కమిటీకి పలు దఫాలుగా ను వివరించారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగులకు బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయామని భట్టి విక్రమార్క అన్నారు. ఇక ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనదే ప్రభుత్వ ఆలోచన అని ఉద్యోగ సంఘాలకు వివరించారు. నేడు గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్టు భట్టి విక్రమార్క తెలిపారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు గా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నిటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు టీజీఈ జేఏసీ ఛైర్మన్‌మారం జగదీశ్వర్ ,సెక్రటరీ జనరల్‌ఏలూరు శ్రీనివాస్‌రావు, టీఎన్‌జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ తదితర ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. గత పది సంవత్సరాల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలని , వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే మా ప్రభుత్వం రాగానే మొదటి తారీకు నే జీతాలు చెల్లిస్తుందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలు పెద్ద సంఖ్యలో తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నామని వీటికి తోడు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్న తపనలో ప్రజా ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

వనరులు సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నాం అదే నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నామని, ఈ కసరత్తు విజయవంతం కావాలని మనసున్న ప్రభుత్వం కోరుకుంటుందని వివరించారు. ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని వివరించారు. ప్రభుత్వ ఆదాయానికి , ఖర్చుకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకొని ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని డిప్యూటీ సీఎం ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై క్యాబినెట్ సహచరులం అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదని భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రీ మెన్ కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్ కు నివేదిస్తామని, పరిష్కారం కూడా కనుగొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. ఉద్యోగ సంఘాలతో పాటు ఈ సమావేశం లో అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

## ఒకనాటి బాలకార్మికుడే.. దేశాధ్యక్షుడు

అధ్యక్ష ఎన్నికల్లో లీ జేమ్యుంగ్ నెగ్గడంతో దక్షిణ కొరియాలో దాదాపు ఆరు నెలలుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడిందనే చెప్పాలి. గత అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ డిసెంబరులో అత్యయిక పరిస్థితి విధించాలన్న నిర్ణయం తీసుకోవడంతో ఆ దేశం రాజకీయ సంక్షోభంలో చిక్కుకొంది.

అధ్యక్ష ఎన్నికల్లో లీ జేమ్యుంగ్ నెగ్గడంతో దక్షిణ కొరియాలో దాదాపు ఆరు నెలలుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడిందనే చెప్పాలి. గత అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ డిసెంబరులో అత్యయిక పరిస్థితి విధించాలన్న నిర్ణయం తీసుకోవడంతో ఆ దేశం రాజకీయ సంక్షోభంలో చిక్కుకొంది. అనంతర పరిణామాల్లో యూన్‌పై పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దాన్ని ధ్రువీకరించడానికి రాజ్యాంగ న్యాయస్థానం సమయం తీసుకోవడంతో ఎన్నికల ప్రక్రియ కాస్త ఆలస్యమైనా, అంతిమంగా దక్షిణ కొరియా ప్రజలు బలమైన తీర్పునే ఇచ్చారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన 61 ఏళ్ల లీని గెలిపించి, అధికార పీపుల్స్ పవర్ పార్టీకి చెందిన కిమ్ మూన్ సూను ఓడించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే శక్తులకు తాము మద్దతివ్వబోమన్న సంకేతాన్నిచ్చారు. లీ జేమ్యుంగ్ 1963లో నిరుపేద కుటుంబంలో జన్మించారు. బాలకార్మికుడిగా పనిచేస్తూనే చదువును కొనసాగించారు. 1982లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1986లో బార్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులై లాయరుగా ప్రాక్టీసు ప్రారంభించారు. పేదలు, కార్మికుల పక్షాన ఎక్కువ కేసులు పోరాడిన ఆయనకు మానవ హక్కుల న్యాయవాదిగా మంచి పేరుంది. 2005లో లీ రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆరంభంలో ఎదురుదెబ్బలు తిన్నా తర్వాత కాలంలో మేయర్‌గా, గవర్నర్‌గా ఎన్నికై పాలనలో తన సత్తా నిరూపించుకున్నారు. 2022 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి.. కేవలం 0.73 శాతం ఓట్లతోనే పీపుల్స్ పవర్ పార్టీ అభ్యర్థి యూన్ సుక్ యోల్ చేతిలో లీ ఓడిపోయారు.లీపై పలు కేసులు ఉన్నాయి. కొన్నింటిలో అభియోగాలు తీవ్రమైనవి. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న సమయంలోనే ఆయన కేసులపై విచారణను కోర్టులు నిలిపివేశాయి. పదవిలో ఉన్నంతకాలం ఈ కేసులు ముందుకు కదలకపోవచ్చు. ఈ విషయంలో దక్షిణ కొరియా అధ్యక్షుడికి చట్టపరంగానూ మినహాయింపు ఉంది. లీపై 2024లో హత్యాయత్నం కూడా జరిగింది. ఆటోగ్రాఫ్ అడుగుతూ ఓ వ్యక్తి ఆయన మెడపై బలమైన గాయం చేశాడు. దాదాపు రెండు గంటలు వైద్యులు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. తాగి వాహనం నడిపిన కేసు కూడా లీపై నమోదైంది. 2018లో వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణలూ ఆయనపై వచ్చాయి. 2022కు సంబంధించిన ఎన్నికల కేసులో కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. తర్వాత అప్పీల్‌కోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించినా.. ఆ తీర్పును సుప్రీంకోర్టు తిరస్కరించింది.రెండు కొరియాలు కలవాలన్న బలీయమైన ఆకాంక్ష ఉన్న వ్యక్తి లీ జే మ్యుంగ్. ఉత్తరకొరియాతో స్నేహసంబంధాలు కొనసాగించాలన్నది ఆయన విధానం. యూన్ సోక్ యోల్ నేతృత్వంలోని గత ప్రభుత్వం అనుసరించిన వైఖరికి ఇది పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయంలో లీకి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనే చెప్పాలి. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉండటం కలిసొచ్చే అంశం. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవిలోకి వచ్చినపుడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపారు. కాబట్టి లీ విధానానికి అగ్రరాజ్యం నుంచి పెద్దగా అభ్యంతరాలు వ్యక్తంకాకపోవచ్చు. అయితే అమెరికా విధించిన ఆర్థిక సుంకాలు దక్షిణకొరియాను రానున్న రోజుల్లో తీవ్ర సంక్షోభంలోకి నెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లీ అధ్యక్ష ప్రయాణం నల్లేరుపై నడక మాత్రం కాదంటున్నారు విశ్లేషకులు.

## ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ ఆయుధాలే కీలకం.. ప్రధాని మోడీ

ఈ కబురు: ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి జరిగిన మంత్రి మండలి సమావేశంలో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌లో తయారైన స్వదేశీ ఆయుధాలు కీలకంగా పని చేశాయని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆయుధాలతో సమానంగా శక్తిని ప్రదర్శించాయని నొక్కి చెప్పారు. రాబోయే కాలంలో మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారైన రక్షణ పరికరాలు, ఆయుధాలకు మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దేశ పురోగతికి నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను త్వరగా సాధించగలిగేలా మంత్రులు వేగంగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ పై వివరణాత్మకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సైనిక ఆపరేషన్‌లో పాకిస్తాన్ సైతం భారీ నష్టాలను చవిచూసిందని, స్వయంగా ఆ దేశమే దీనిని అంగీకరించిందని తెలిపారు. అలాగే తమ రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు ఎదుర్కోవాలని కూడా మోడీ మంత్రులకు సూచించినట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## తక్షణ శాంతి అసాధ్యం

**ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తనతో చాలా గట్టిగా చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.**

ఈ కబురు,వాషింగ్టన్, కీవ్: ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తనతో చాలా గట్టిగా చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ రెండు దేశాల మధ్య తక్షణ శాంతి అసాధ్యమని అభిప్రాయపడ్డారు. బుధవారం పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడానని, సంభాషణ సవ్యంగానే కొనసాగినప్పటికీ శాంతి సాధనకు అది ఉపకరించదని సామాజిక మాధ్యమంలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం గురించి కూడా తాము మాట్లాడుకున్నామని వెల్లడించారు. రష్యా భూభాగంలో 4వేల కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి ఆ దేశ వైమానిక స్థావరాలపై డ్రోన్లతో ఉక్రెయిన్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 41 యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు.

ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తాం: బ్రిటన్
ఉక్రెయిన్‌కు 2026 ఏప్రిల్ నాటికి లక్ష డ్రోన్లు అందజేస్తామని బ్రిటన్ హామీ ఇచ్చింది. వీటి విలువ దాదాపు 350 మిలియన్ పౌండ్లు. రష్యా దాడుల ముప్పును సమర్థంగా ఎదుర్కోవటానికి కీవ్‌కు ఇచ్చే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఇది భాగమని పేర్కొంది. మరోవైపు రష్యా రక్షణ విభాగ ఉన్నతాధికారి ఒకరు బుధవారం ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ చేరుకున్నారు. ఇరుదేశాలు గత ఏడాది కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాన్ని పొడిగించుకోవడంపై చర్చించుకునే అవకాశం ఉందని సమాచారం. తూర్పు సైబిరియాలోని రష్యాకు చెందిన బెలయా వైమానిక స్థావరం ఉక్రెయిన్ డ్రోన్ల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దాడిలో ధ్వంసమైన విమానాలు ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.





## వివాదాల పరిష్కారానికి డబ్ల్యూటీఓలో బలమైన యంత్రాంగం: పీయూష్ గోయల్

**సుంకాలతో సంబంధం లేకుండా ఎదురవుతున్న అడ్డంకులను ప్రపంచ వాణిజ్య సంస్థ తొలగించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.**

సుంకాలతో సంబంధం లేకుండా ఎదురవుతున్న వాణిజ్యపరమైన అడ్డంకులను తొలగించాలని ప్రపంచ వాణిజ్యసంస్థకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. అసమాన వాణిజ్య విధానాలను సరిదిద్దాలని, బలమైన వివాద పరిష్కార వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. తక్కువ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత మంత్రి వర్గ సమావేశాల్లో ముగింపు దశకు వచ్చిన అంశాలపై డబ్ల్యూటీఓ దృష్టిసారించాలని సూచించారు.

వాణిజ్యేతర అడ్డంకులను అరికట్టడం, వివాదాలకు కచ్చితమైన పరిష్కారం కోసం డబ్ల్యూటీఓలో బలమైన వ్యవస్థను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని గోయల్ అన్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, ఫ్రాన్స్, నైజీరియాతో పాటు 25 దేశాల మంత్రులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ న్గోజీ ఒకోంజోఇవిమా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయ సమస్యలు, మత్స్య సంపద క్షీణత ఇలా అనేక విషయాల్ని ఈ సమావేశంలో చర్చించారు.

# మైక్రోసాఫ్ట్‌ను దాటేసిన ఎన్విడియా..
# అత్యంత విలువైన కంపెనీల్లో మళ్లీ టాప్

**ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎన్విడియా అవతరించింది. మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి మొదటిస్థానంలో నిలిచింది.**

ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎన్విడియా అవతరించింది. మెరుగైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేర్లు రాణిస్తున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 3.4 శాతం లాభపడ్డాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 3.45 ట్రిలియన్ డాలర్లకు (సుమారు రూ.296.22 లక్షల కోట్లు) చేరింది. ఇప్పటివరకు ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో మొదటి స్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ .. ప్రస్తుతం రెండో స్థానంలో నిలిచింది. కృత్రిమ మేధ రంగంలో బలమైన స్థానాన్ని కొనసాగిస్తూ మార్కెట్ విలువను గణనీయంగా పెంచుకోవడంతో ఎన్విడియా ఈ ఘనత సొంతం చేసుకుంది.

ఎన్విడియా ఏప్రిల్‌తో ముగిసిన తొలి త్రైమాసిక ఫలితాల్ని ప్రకటించింది. కంపెనీ ఆదాయం 44.1 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.3.78 లక్షల కోట్లుగా) నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 12 శాతం, గతేడాది ఇదే సమయంలో నమోదైన ఆదాయంతో పోలిస్తే 69 శాతం వృద్ధి చెందింది. వాణిజ్య ఆంక్షలు, కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ ఎన్విడియా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. కేవలం చిప్‌ల తయారీకే పరిమితం కాకుండా ఏఐకి సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తోంది. రానున్న నాలుగేళ్లలో సుమారు అర ట్రిలియన్ డాలర్ల విలువైన ఏఐ సూపర్ కంప్యూటర్లు, డేటా సెంటర్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




మే నెలలో 'స్టార్‌గేట్ యూఏఈ' అనే ప్రాజెక్ట్‌ను ఎన్విడియా ప్రకటించింది. దీనిద్వారా అబుదాబీలో ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్లను నిర్మించనుంది. ఓపెన్‌ఏఐ, ఒరాకిల్‌తో సహా పలు సంస్థల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఇదిలాఉండగా.. ఎన్విడియా ప్రపంచలోనే అత్యంత విలువైన కంపెనీగా అగ్రస్థానానికి చేరడం ఇదేం తొలిసారి కాదు. ఈ ఏడాది జనవరి 24లో తొలిసారిగా ఆ ఘనత సొంతం చేసుకుంది. తర్వాత తన స్థానాన్ని కోల్పోయింది. ఏఐ చిప్‌లకు పెరుగుతున్న డిమాండ్, బలమైన ఆదాయ వృద్ధితో ఇప్పుడు మళ్లీ మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..
# 24600ఎగువకు నిఫ్టీ

**దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 260 పాయింట్లు, నిఫ్టీ 77 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. దీంతో వరుసగా మూడు రోజులు నష్టాల్లో ముగిసిన సూచీలకు నేడు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 80,777.65 పాయింట్ల (క్రితం ముగింపు 80,737.51) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ ఇంట్రాడేలో 80,705.18 81,087.29 మధ్య కదలాడింది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ చివరకు 260 పాయింట్ల లాభంతో 80,998 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,644.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 77 పాయింట్ల లాభంతో 24,620.20 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఇండస్ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.93 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,387 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**లిస్టింగ్‌లు ఇవే..**

ప్రధాన బోర్డు నుంచి వచ్చిన స్కోడా ట్యూబ్స్ ఐపీఓకు షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర 140 కాగా ఆ ధర వద్దే షేర్లు లిస్ట్ అయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం షేర్లు రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు 5 శాతం లాభంతో రూ.147 వద్ద ముగిశాయి.



ఎస్ఎంఈ విభాగం నుంచి వచ్చిన నెప్ట్యూన్ పెట్రో కెమికల్ షేర్లు నేడు దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్ అయ్యాయి. ఎన్ఎస్ఈలో 9 శాతం ప్రీమియంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.122 కాగా ఎన్ఎస్ఈలో రూ.132.75 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఇంట్రాడేలో రాణించిన షేర్లు మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో 14 శాతం లాభంతో రూ.139 వద్ద ముగిశాయి.

## భార్య వైపు చూస్తూ కూర్చోవడం గురించి మాట్లాడలేదు : నవ్వులు పూయించిన హర్ష్ గోయెంకా



భార్య వైపు చూస్తూ కూర్చోవడం గురించి తాను మాట్లాడలేదంటూ హర్ష్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా ఎప్పటికప్పుడు ఆసక్తికర అంశాలతో నెటిజన్లను పలకరిస్తుంటారు. ఇదేతరహాలో తన గ్రూప్ ఉద్యోగులతో మాట్లాడిన అంశాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. తన చమత్కారంతో వారి ముఖాల్లో నవ్వులు పూయించారు.

''ఇంతకుముందు ఎల్ అండ్ టీ సంస్థ ఛైర్మన్ తన ఉద్యోగులతో మాట్లాడిన అంశాలతో ఇబ్బందుల్లో పడ్డారు. నేను ఆదివారాలు పనిచేయడం గురించి, భార్యల వైపు చూస్తూ కూర్చోవడం గురించి మాట్లాడటం లేదు'' అంటూ ఆయన మాట్లాడుతుంటే ఉద్యోగులంతా నవ్వుతూ చప్పట్లు కొట్టారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. ''మీ చమత్కారంతో ప్రతి ఉద్యోగి నవ్వులు చిందించారు. మీ సంస్థలో సిబ్బంది పనిలో సంతృప్తితో ఉన్నారని నా అభిప్రాయం'' అని ఒకరు కామెంట్ పెట్టారు.

వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యం గతంలో చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో దుమారాన్నే లేపాయి. ''ఆదివారాలు మీతో పని చేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పని చేయించగలిగితే.. నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పని చేస్తున్నాను. ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి'' అంటూ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడిన మాటలపై నెట్టింట్లో విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.

ఈ అంశంపై హర్ష్ గోయెంకా గతంలోనూ స్పందించారు. ''వారానికి 90 గంటల పనా? సండేను సన్‌డ్యూటీ అని.. 'డే ఆఫ్'ను ఓ 'ఊహాజనిత భావన' అని ఎందుకు మార్చకూడదు. కష్టపడి తెలివిగా పని చేయడంపై నాకు నమ్మకం ఉంది. కానీ, జీవితాన్ని శాశ్వతమైన ఆఫీసు షిఫ్టుగా మారిస్తే అది వినాశనానికి దారితీస్తుందే తప్ప విజయాన్ని తీసుకురాదు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అనేది ఆప్షన్ కాదు. అవసరం అని నా అభిప్రాయం'' అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'వర్క్ స్మార్ట్ నాట్ స్లేవ్' అంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జత చేసిన సంగతి తెలిసిందే.



# 78 శాతం మేరకు పెరగనున్న
# స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్

**రాబోయే 2-3 సంవత్సరాల్లో భారత్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్ సంవత్సరానికి 7-8% పెరుగుతుందని ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తెలిపింది.**

దేశంలో స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్ రాబోయే 23 సంవత్సరాల్లో 78 శాతం పెరుగుతుందని ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ బుధవారం తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దీని వినియోగం 40.80 లక్షల టన్నులకు చేరుకుంది. ఇది సంవత్సరానికి దాదాపు 8 శాతం వృద్ధిని నమోదు చేసిందని అధ్యక్షులు రాజమణి కృష్ణమూర్తి..గ్లోబల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ ఎక్స్‌పోలో తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం అత్యధిక వృద్ధిని నిలుపుకునే అవకాశం ఉండడంతో స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్ 78 పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు రాజమణి కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ ఉక్కు వినియోగం 6 కిలోలుంటే, భారత్‌లో అది 3.4 కిలోలు మాత్రమే ఉందని..ఇది ప్రపంచ సగటుతో పోలిస్తే తక్కువని అన్నారు. కాబట్టి, దేశంలో ఉక్కు వినియోగం భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధ్యక్షులు తెలిపారు. భారత్‌లో నిర్మాణ మార్కెట్ 2027 నాటికి 1.42 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, 2027 వరకు 17.26 శాతం తో విస్తరిస్తుందని ఆయన అన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి..రైల్వేలు, వివిధ సొరంగాలు, ఓడరేవులు, విమానాశ్రయాల నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగానికి అనేక అవకాశాలు ఉన్నాయి.

# 'సలార్ 2' కోసం ఎదురుచూస్తున్నాం: ప్రశాంత్ నీల్‌కు స్టార్ హీరోల విషెస్



**దర్శకుడు ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్, ప్రభాస్ విషెస్ తెలిపారు. వారి అప్‌కమింగ్ సినిమాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.**

తొలి సినిమాతోనే తన ప్రత్యేకతను చాటుకొని కేజీఎఫ్‌తో ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్ . 'సలార్'తో తన టాలెంట్‌తో అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్ , ప్రభాస్‌లు విషెస్ చెప్పారు.

'మీ మాటల కంటే.. మీ విజన్ ఎక్కువగా మాట్లాడుతుంది. తెరపై మీ మ్యాజిక్ చూసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్'తో సూపర్ హిట్‌ను అందుకున్న ప్రభాస్ కూడా విషెస్ చెప్పారు. ''హ్యాపీ బర్త్‌డే మై సలార్. సలార్ పార్ట్ 2లో మరింత విధ్వంసం చేయడానికి ఎదురుచూస్తున్నా. లవ్యూ'' అని తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. నిర్మాణ సంస్థలు కూడా ప్రశాంత్ నీల్ ఫొటోలు షేర్ చేస్తూ విషెస్ చెబుతున్నాయి.

**అద్భుతం చేశారు.. కంగ్రాట్స్ ఆర్సీబీ.. సినీ, రాజకీయ ప్రముఖుల అభినందనలు**

ప్రస్తుతం ఎన్టీఆర్‌తో తీయనున్న సినిమాతో ప్రశాంత్ నీల్ బిజీగా ఉన్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'సలార్ 2' పనులు ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది. ఇక 18 ఏళ్ల తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కప్పు గెలవడంపై ప్రశాంత్ నీల్ భావోద్వేగానికి గురయ్యారు. ఆనందంతో ఎగిరి గంతేశాడు. ఈ వీడియోను ఆయన సతీమణి లికితా రెడ్డి ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. ''క్రేజియెస్ట్ క్రికెట్ ఫ్యాన్‌కు ఇది పర్‌ఫెక్ట్ బర్త్‌డే గిఫ్ట్'' అంటూ రాసుకొచ్చారు.




# డిసెంబరు 5న రాజాసాబ్

**ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఎట్టకేలకి విడుదల తేదీని ఖరారు చేసుకుంది.**

ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఎట్టకేలకి విడుదల తేదీని ఖరారు చేసుకుంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. టీజర్‌ని ఈ నెల 16న విడుదల చేయనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. మంగళవారం ప్రత్యేకమైన ఓ పోస్టర్‌తోపాటు, సినిమా, టీజర్ విడుదల వివరాల్ని ప్రకటించింది నిర్మాణ సంస్థ. ''భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ గొప్ప అనుభూతిని పంచుతుంద''ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి **ఛాయాగ్రహణం: కార్తీక్ పళని, సంగీతం: తమన్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్.**

# 'వేదం'కు 15ఏళ్లు.. అనుష్క పోస్టర్ చూస్తూ 40కు పైగా యాక్సిడెంట్‌లు

**క్రిష్ దర్శకత్వంలో వచ్చిన 'వేదం' జూన్4వ తేదీతో 15 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మూవీ గురించి ఆసక్తికర విషయాలు..**



అల్లు అర్జున్ , మంచు మనోజ్ , అనుష్క కీలక పాత్రల్లో క్రిష్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వేదం'. 2010 జూన్ 4న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుని నేటితో 15ఏళ్లు పూర్తి చేసుకుంది. కేబుల్ రాజుగా అల్లు అర్జున్, రాక్‌స్టార్ వివేక్ చక్రవర్తిగా మంచు మనోజ్, సరోజ పాత్రలో అనుష్క, వృద్ధుడు రాములుగా నాగయ్య, భారత్ విడిచి వెళ్లిపోవాలనుకునే రహీముద్దీన్ ఖురేషీ పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ తమ నటనతో మెప్పించారు. ఇక కీరవాణి సంగీతం సినిమాను మరోస్థాయిలో నిలబెట్టింది.

**'వేదం' అలా పుట్టింది!**

'గమ్యం' తర్వాత క్రిష్ కమర్షియల్ హంగులతో ఒక భారీ సినిమా చేయాలని ప్లాన్ చేశారు. అయితే, అదే సమయంలో అమరావతి వెళ్లిన క్రిష్ అక్కడ చూసిన ఓ సంఘటన ఆయన ఆలోచనలను మార్చి, 'వేదం' వైపు అడుగులు వేసేలా చేసింది. 'వేదం' కథ ఎలా పుట్టిందో ఓ సందర్భంలో ఇలా చెప్పుకొచ్చారు క్రిష్.

''గమ్యం' హిట్టయిన తర్వాత ఒక కమర్షియల్ హంగులతో సినిమా చేయాలని ఎన్నో అనుకున్నాం. అదే సమయంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో వార్షికోత్సవానికి పిలిస్తే అక్కడకు వెళ్లా. అక్కడ విద్యార్థులు చేసిన ప్రదర్శన నాకు బాగా నచ్చింది. మా కన్నా గొప్ప ఆలోచనలతో పలు ప్రదర్శనలు చేశారు. ఆ ఈవెంట్ అయిపోయిన తర్వాత ఆ ఆలోచనలతోనే అక్కడి నుంచి బయలుదేరా''

''మా ఎడిటర్ శ్రవణ్, కెమెరామెన్ జ్ఞానశేఖర్, మేనేజర్ మురళిగారితో అమరావతి పక్కనే వైకుంఠపురం ఆలయానికి వెళ్లాం. అక్కడ వైష్ణవి అనే అమ్మాయి, ఆమె తమ్ముడు గుడికి వచ్చారు. తను నన్ను గుర్తుపట్టింది. 'మీరు గమ్యం క్రిష్ కదా' అని అంది. 'అవును' అని సమాధానం ఇచ్చా. అదే విషయాన్ని వాళ్ల తమ్ముడికి కూడా చెప్పింది. 'గమ్యం'లో నీకు ఏం నచ్చింది' అని అడిగా. 'జానకిని వెతికేందుకు బయలుదేరిన అభిరామ్ ఆ ప్రయాణంలో తనని తాను తెలుసుకుంటున్నానని చెప్పిన డైలాగ్ బాగుంది' అని చెప్పింది. ఆ తర్వాత అందరం కలిసి ఉండవల్లి గుహలను చూడటానికి వెళ్లాం''

''అక్కడ ఓ చిన్న పిల్లాడు వృద్ధుడి వేలు పట్టుకుని లాక్కెళ్తున్న దృశ్యం కనిపించింది. ఆ దృశ్యాన్ని మేం ఫొటో తీశాం. అక్కడి నుంచి రాగానే కథ చెప్పాను. 'ఒక చిన్న పిల్లాడు. వెట్టిచాకిరీ చేస్తాడు. వాడిని విడిపించుకోవడానికి వాళ్లమ్మ కిడ్నీలు అమ్ముకుంటుంది' ఇది అసలు 'వేదం' కథకు బీజం. ఆ తర్వాత మనోజ్ కథ పుట్టింది. మిగిలిన కథలు అప్పటికి అనుకోలేదు. నాకు ఏదైనా ఆలోచన వస్తే, సీతారామశాస్త్రిగారితో పంచుకుంటా. ఇది కూడా ఆయనతో పంచుకున్నా. అంతకుముందు చేద్దామనుకున్న కమర్షియల్ సినిమాను చేయనని నిర్మాతలకు చెప్పేశా. ఈ విషయం అల్లు అర్జున్‌కు తెలిసి నాకు ఫోన్ చేశాడు. 'క్రిష్ నీకు సమయం ఉంటే మనిద్దరం కలిసి ఒక సినిమా చేద్దాం' అన్నాడు. అప్పుడు బన్ని 'ఆర్య 2' షూటింగ్‌లో ఉన్నాడు. షూటింగ్‌కు ఒక రోజు విరామం కావడంతో ఇద్దరం భోజనం చేయడానికి వెళ్లాం''

''అప్పుడే నేను 'వేదం' అనే చిన్న సినిమా చేస్తున్నట్లు చెప్పా. 'గమ్యం బాగా తీశావు. మంచి సినిమా చెయ్ కావాలంటే నేను డేట్స్ ఇస్తా' అన్నాడు. అప్పుడే 'వేదం' అందులోని కేబుల్ రాజు క్యారెక్టర్ చెప్పా. తనకు బాగా నచ్చింది. సినిమాను తనే ప్రొడ్యూస్ చేస్తానని చెప్పాడు. ఇక రాక్‌స్టార్ పాత్రకు రానా లేదా మంచు మనోజ్ అయితే బాగుంటుందని అనుకున్నా. అయితే, అప్పుడు రానా 'లీడర్' సినిమా చేస్తున్నాడు. దాంతో మనోజ్‌కు కథ చెబితే వెంటనే ఒప్పుకొన్నాడు. ఇక మాకు అసలు సవాల్ వేశ్య పాత్రకు అనుష్కను ఒప్పించడం. 'తను ఒప్పుకొంటే సినిమా మరో స్థాయిలో ఉంటుంది' అని బన్ని చెప్పాడు. తనని కలిసి ఎలా కథ చెప్పాలో అర్థంకాలేదు. ఒక రోజు ఆమె దగ్గరకు వెళ్లి భయపడుతూనే కథ చెప్పా. కథ విన్న వెంటనే ఆమెకు కన్నీళ్లు ఆగలేదు. వెంటనే ఒప్పుకొంది. అలా 'వేదం' పట్టాలెక్కింది'' అని చెప్పుకొచ్చారు.



**అనుష్క పోస్టర్ 40కు పైగా యాక్సిడెంట్‌లు**

**అల్లు అర్జున్, మంచు మనోజ్, అనుష్కలు నటిస్తుండటంతో చిన్న సినిమా కాస్తా పెద్దది అయిపోయింది. అంచనాలూ పెరిగిపోయాయి. జూన్ 4న విడుదలైన ఈ చిత్రం విమర్శకులను మెప్పించింది. ప్రతి ఒక్కరూ తమ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. వృద్ధుడి వద్ద డబ్బులు కొట్టేసినప్పుడు, తిరిగి ఇచ్చినప్పుడు అల్లు అర్జున్ కనబరిచిన నటన థియేటర్‌లోని ప్రేక్షకుడితోనూ కన్నీళ్లు పెట్టిస్తుంది. ఇక వేశ్యగా అనుష్క నటన హైలైట్. కథానాయికగా వరుస అవకాశాలు దక్కించుకుంటున్న సమయంలో ఆ పాత్రను ఎంచుకోవడం నిజంగా ధైర్యమనే చెప్పాలి. ఏమాత్రం తేడాగా నటించినా సినిమాపైనా, అనుష్క కెరీర్‌పైనా గట్టి ప్రభావం చూపించేది. కానీ, అనుష్క అలవోకగా చేసేశారు. ఇక ఈ సినిమా ప్రచారంలో భాగంగా అనుష్క వెనక్కి తిరిగి కొంటెగా చూస్తున్న ఫొటోను పెద్ద హోర్డింగ్ చేసి, పంజాగుట్ట సెంటర్‌లో పెట్టారు. ఆ సమయంలో 40కు పైగా యాక్సిడెంట్‌లు అయ్యాయి. ఒకానొక దశలో పోలీసులకు ఫిర్యాదు అందడంతో జీహెచ్‌ఎంసీ వాళ్లతో కలిసి పోలీసులు ఆ హోర్డింగ్‌ను తొలగించారు. అంతలా అనుష్క మెస్మరైజ్ చేసింది.**

**అవార్డుల వెల్లువ...**

'వేదం' చిత్రానికి అవార్డులూ వరించాయి. 2010కి గానూ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును సొంతం చేసుకోగా, వృద్ధుడి పాత్ర పోషించిన నాగయ్యకు స్పెషల్ జ్యూరీ పురస్కారం వచ్చింది. 58వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఉత్తమ చిత్రం (శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని), ఉత్తమ దర్శకుడు (క్రిష్), ఉత్తమ నటుడు (అల్లు అర్జున్), ఉత్తమ నటి (అనుష్క) అవార్డులు దక్కాయి. తమిళంలో ఈ చిత్రాన్ని 'వానం' పేరుతో తెరకెక్కించారు. శింబు, భరత్, ప్రకాష్‌రాజ్, అనుష్క కీలక పాత్రలు పోషించారు. అక్కడ కూడా ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ''వేదం'కు 15ఏళ్లు. ఈ సినిమా నా ఇతర సినిమాలతో పోలిస్తే నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. దర్శకుడు క్రిష్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఎంతో నిజాయతీతో ఈ మూవీ తీశారు. నా సహ నటులు అనుష్క, మనోజ్, మనోజ్ బాజ్‌పాయ్ సహా ఇతరులతో కలిసి ప్రయాణించడం నిజంగా నాకు స్పెషల్. సంగీత దర్శకుడు కీరవాణిగారు, నిర్మాతలు శోభు, ప్రసాద్ దేవినేనిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా'' ఎక్స్ వేదికగా అల్లు అర్జున్ పోస్ట్.

# సిద్ధూ జొన్నలగడ్డ గొప్ప మనసు..

## సగం రెమ్యూనరేషన్ వెనక్కి ఇచ్చిన హీరో!



**యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ గొప్ప మనసు చాటుకున్నారు. 'జాక్' నిర్మాతకు సగం రెమ్యూనరేషన్‌ను వెనక్కి ఇచ్చేశారు.**

**టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ . ఇటీవల ఈ నటుడు 'జాక్'తో ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. దీంతో సిద్ధూ ఓ గొప్ప నిర్ణయం తీసుకున్నారు.**

**బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'జాక్'. ఈ సినిమా కోసం ఈ హీరో రూ.8 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకున్నారట. అయితే, సినిమా విజయం సాధించకపోవడంతో అందులో సగం పారితోషికాన్ని (రూ.4 కోట్లు) వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నారు. ఈవిషయం తెలిసిన నెటిజన్లు గొప్ప మనసు చాటుకున్నారని అంటూ హీరోపై ప్రశంసలు కురిపిస్తున్నారు.**

**ప్రస్తుతం సిద్ధూ జొన్నలగడ్డ 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందుతోన్న ఈ సినిమా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మనసుని తాకే భావోద్వేగాలతో, ఊహించని మలుపులతో సాగే కథ ఇదని సినీ వర్గాలు వెల్లడించాయి.**



# అమ్మాయిలకు ఓ నమ్మకాన్నిచ్చే దేవిక అండ్ డానీ

**"చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది" అన్నారు నటి రీతూ వర్మ.**

**"చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది" అన్నారు నటి రీతూ వర్మ. ఇది ఆమె నటించిన తొలి వెబ్‌సిరీస్. 'శ్రీకారం' విజయంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన బి.కిశోర్ దీన్ని రూపొందించారు. సుధాకర్ చాగంటి నిర్మాత. సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. "వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌లు వస్తే వెబ్‌సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకొచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు" అంది. "సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిల్ని.. 'ఈ పని చేయి, ఆ పని చేయక'ని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్‌లో చక్కగా చూపించార"న్నారు నటుడు సూర్య వశిష్ఠ. దర్శకుడు బి.కిశోర్ మాట్లాడుతూ.. "శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చూసే ప్రేక్షకుల సమయం అసలు వృథా కాదు. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివ కందుకూరి, సుధాకర్, మౌనిక, నందిని, జై క్రిష్ తదితరులు పాల్గొన్నారు.**



# ఆర్సీబీకి రూ.20 కోట్లు, పంజాబ్ కింగ్స్‌కు రూ.12.5 కోట్లు!

**ఐపీఎల్ 2025 ట్రోఫీ విజేతగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రైజ్ మనీగా 20 కోట్ల రూపాయలను సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ 12.5 కోట్ల రూపాయలు పొందింది.**

ఐపీఎల్ 2025 ట్రోఫీని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రైజ్ మనీగా 20 కోట్ల రూపాయలను సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ 12.5 కోట్ల రూపాయలు పొందింది. ఆర్సీబీకి ఇదే తొలి ఐపీఎల్ టైటిల్ కావడం గమనార్హం. గతంలో ఈ టీమ్ 2009, 2011, 2016లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ చివర్లో బోల్తా పడింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ.. బెంగళూరు జట్టు ఐపీఎల్ 2025 ట్రోఫీని కైవసం చేసుకుంది. క్వాలిఫయర్ 2లో ఓడిపోయి, మూడో స్థానంలో నిలిచిన ముంబయి ఇండియన్స్ జట్టుకు రూ.7 కోట్లు దక్కాయి. ఎలిమినేటర్‌లో పరాజయం పాలై, నాలుగో స్థానానికి పరిమితమైన గుజరాత్ టైటాన్స్ రూ.6.5 కోట్లు తమ ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు 2008 సీజన్‌లో ప్రైజ్‌మనీ రూ.4.8 కోట్లుగా ఉండేది. రన్నరప్‌నకు 2.4 కోట్లు దక్కేవి. అప్పటి నుంచి క్రమంగా ప్రైజ్‌మనీ పెరుగుతూ వస్తోంది.

**దిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కూ అవార్డు**

'బెస్ట్ పిచ్ అండ్ గ్రౌండ్' అవార్డును దిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సొంతం చేసుకుంది. డీడీసీఏ రూ.50 లక్షలు గెలుచుకుంది. ఈ సీజన్‌లో అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఏడు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. 'ఈ అవార్డు మా క్యూరేటర్లు, సిబ్బంది, యాజమాన్యం అవిశ్రాంత కృషికి నిదర్శనం. క్రికెట్ మౌలిక సదుపాయాల్లో అత్యున్నత ప్రమాణాలు కొనసాగించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సందర్భంగా అన్నాడు.

**ఎవరెవరు.. ఎంత గెలుచుకున్నారంటే..**

అత్యధిక పరుగుల వీరుడిగా ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయిసుదర్శన్ (759 రన్స్), అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచి, పర్పుల్ క్యాప్ సాధించిన ప్రసిద్ధ్‌కృష్ణ (25 వికెట్లు) చెరో రూ.10 లక్షలు గెలుచుకున్నారు. ఎమర్జింగ్ ప్లేయర్‌గా సాయి సుదర్శన్ మరో రూ.10 లక్షలు, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా సూర్యకుమార్ యాదవ్ రూ.15లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచిన వైభవ్ సూర్యవంశీ రూ.10 లక్షలతో పాటు, కారు, బెస్ట్ క్యాచ్ విన్నర్‌గా నిలిచిన కమిందు మెండిస్ రూ.10 లక్షలు, మోస్ట్ డాట్ బాల్స్ సంధించిన మహ్మద్ సిరాజ్ రూ.10 లక్షలు గెలుచుకున్నారు. ఫెయిర్ ప్లే అవార్డును చెన్నై సూపర్ కింగ్స్ (రూ.10 లక్షలు) సొంతం చేసుకుంది.

# అన్ లక్కీ చహల్.. చరిత్రలో తొలి ఆటగాడు

**టాలెంట్ ఎంతున్నా ఆవగింజంతైనా అదృష్టం ఉండాలన్న నానుడు స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ విషయంలో మరోసారి నిరూపితమైంది. ఇతగాడు ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చలామణి అవుతున్నా (174 మ్యాచ్‌ల్లో 221 వికెట్లు).. ఇప్పటివరకు తాను ప్రాతినిధ్యం వహించిన ఒక్క ఫ్రాంచైజీకి కూడా టైటిల్ అందించలేకపోయాడు.**



2013 సీజన్లో ఆర్సీబీ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన యుజీ.. ఇప్పటివరకు మూడు వేర్వేరు ఫ్రాంచైజీల తరఫున ఫైనల్స్ ఆడాడు. మూడింటిలో అతన్ని అదృష్టం వెక్కిరించింది.

తొలిసారి యుజీ 2016 సీజన్‌లో ఫైనల్ ఆడగా.. ఆ మ్యాచ్‌లో అతను ప్రాతినిధ్యం వహించిన ఆర్సీబీకి సన్‌రైజర్స్ చేతిలో భంగపాటు ఎదురైంది. రెండో సారి 2022 సీజన్‌లో ఫైనల్ ఆడగా.. ఆ మ్యాచ్‌లో అతని జట్టు రాజస్థాన్ రాయల్స్ గుజరాత్ టైటాన్స్ చేతిలో పరాజయంపాలైంది.

తాజాగా యుజీ ఆడిన మూడో ఫైనల్లో అతని కొత్త జట్టు పంజాబ్.. అతని మాజీ జట్టు ఆర్సీబీ చేతిలో ఓటమిని ఎదుర్కొంది. ఈ లెక్కన ఐపీఎల్ చరిత్రలో మూడు వేర్వేరు ఫ్రాంచైజీల తరఫున ఫైనల్స్ ఆడి ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయిన ఏకైక ఆటగాడిగా చహల్ చరిత్రకెక్కాడు. ఇది తెలిసి క్రికెట్ అభిమానులు అతన్ని అన్ లక్కీ ఛార్మ్ అని అంటున్నారు. మూడు ఫైనల్స్‌లో అతను ఆటగాడిగా రాణించినా అతని జట్లను మాత్రం గెలిపించుకోలేకపోయాడు. మూడు ఫైనల్స్‌లో చహల్ పొదుపుగానే బౌలింగ్ చేసి ఒక్కో వికెట్ తీశాడు.

ఇదిలా ఉంటే, ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా అవతరించింది. నిన్న (జూన్ 3) జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో విజయం సాధించి తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ సీజన్‌లో పంజాబ్, ఆర్సీబీ పోటీపోటీగా రాణించి ఫైనల్ వరకు చేరాయి. అయితే తుది సమరంలో ఆటగాళ్ల అనుభవం ఆర్సీబీని గట్టెక్కించింది. ఫైనల్లో ఓడినా శ్రేయస్ సేన శభాష్ అనిపించుకుంది. సీజన్ ఆద్యాంతం ఆ జట్టు ఛాంపియన్ గేమ్ ఆడింది. అనుభవలేమి ఆటగాళ్లతో శ్రేయస్ జట్టును నడిపించిన తీరు అత్యద్భుతమని విమర్శకులు సైతం ప్రశంసిస్తున్నారు. నిన్నటి ఫైనల్లో సైతం ఆ జట్టు అంత ఈజీగా ఆర్సీబీకి తలొగ్గలేదు. తొలుత అద్భుతంగా బౌలింగ్ చేసి ఆర్సీబీ ఊహించిన దానికంటే తక్కువ స్కోర్‌కే కట్టడి చేసింది.

ఆతర్వాత బ్యాటింగ్‌లో సైతం మంచి ఆరంభాన్నే పొందినప్పటికీ మధ్యలో ఒత్తిడికి లోనై వికెట్లు చేజార్చుకుంది. అయినా ఆర్సీబీకి అంత ఈజీగా గెలుపును దక్కనివ్వలేదు. చివరి ఓవర్ వరకు ఆ జట్టు బ్యాటర్ శశాంక్ సింగ్ పోరాడాడు. ఓటమి ఖాయమైనా శశాంక్ తగ్గేదేలేదన్నాడు. హాజిల్‌వుడ్ వేసిన చివరి ఓవర్‌లో 2 సిక్సర్లు, 2 ఫోర్లు సహా 22 పరుగులు రాబట్టాడు.

అయినా పంజాబ్ గెలుపుకు ఏడు పరుగులు తక్కువయ్యాయి. ఈ ఓటమితో పంజాబ్ గుండె ముక్కలైంది. ఈ యేడు శ్రేయస్ నేతృత్వంలో టైటిల్ ఖాయమని ఆ జట్టు అభిమానులు అనుకున్నారు. కానీ తుది మెట్టుపై ఆర్సీబీ అనుభవం గెలిచింది. ఆ జట్టుకు ఇదివరకే మూడు ఫైనల్స్ ఆడిన అనుభవం ఉండటంతో కీలక సమయంలో పరిస్థితులను బాగా హ్యాండిల్ చేసింది. ఫలితంగా 18 ఏళ్ల తమ టైటిల్ కలను సాకారం చేసుకుంది.



# చాలా బాధగా ఉంది.. అతడే మ్యాచ్‌ను టర్న్ చేశాడు: శ్రేయస్ అయ్యర్

తొలి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడాలని కలలు కన్న పంజాబ్ కింగ్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఐపీఎల్-2025 సీజన్‌లో ఆఖరి మెట్టుపై పంజాబ్ బోల్తా పడింది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఫైనల్ పోరులో 6 పరుగుల తేడాతో పంజాబ్ ఓటమి పాలైంది. ఆర్సీబీ నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని శ్రేయస్ సేన ఛేధించలేకపోయింది. లక్ష్య ఛేధనలో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది. పంజాబ్ బ్యాటర్లలో శశాంక్ సింగ్(61), జోష్ ఇంగ్లిష్ (39) మినహా మిగితా అందరూ తీవ్ర నిరాశపరిచారు. ఆర్సీబీ బౌలర్లలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఈ హార్ట్‌బ్రేకింగ్ ఓటమిపై మ్యాచ్ అనంతరం పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పందించాడు. ఫైనల్లో ఓటమి పాలైనప్పటికి.. ఈ టోర్నీ ఆసాంతం తమ కుర్రాళ్లు అద్బుతమైన ప్రదర్శన కనబరిచారని అయ్యర్ కొనియాడాడు. "ఈ మ్యాచ్‌లో ఓటమి మమ్మల్ని తీవ్ర నిరాశపరిచింది. ఫైనల్లో ఓడినా మా కుర్రాళ్ళు ఆ సందర్భానికి తగ్గట్టు ఆడారు. ఈ మ్యాచ్‌లో ఆశించిన ఫలితం మాకు దక్కలేదు. కానీ మాకు మద్దతుగా నిలిచిన సపోర్ట్ స్టాఫ్, టీమ్ మేనేజ్‌మెంట్, ప్రతీ ఒక్కరికి క్రెడిట్ ఇవ్వాలి. మా యాజమాన్యం కూడా చాలా సపోర్ట్ చేశారు. మా గత మ్యాచ్ దృష్ట్యా 200 పరుగుల లక్ష్యం సులువు అనుకున్నాం. కానీ ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ బౌలర్లు అద్బుతంగా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా కృనాల్ తన బౌలింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతడికి చాలా అనుభవం ఉంది. తన ఎక్స్‌పీరియన్స్‌ను మరోసారి చూపించాడు. జట్టులోని ప్రతీ ఒక్కరూ బాగా రాణించారు. వారి ప్రదర్శన పట్ల చాలా గర్వంగా ఉంది. మా జట్టులోని చాలా మంది కుర్రాళ్లకు ఇదే తొలి సీజన్. అయిప్పటికి వారు ఫియర్‌లెస్ క్రికెట్ ఆడారు. వారందరికి అభినందనలు. వారు లేకపోయింటే మేము ఇక్కడివరకు వచ్చేవాళ్లం కాదు. మా పని ఇంకా పూర్తి కాలేదు. వచ్చే ఏడాది ట్రోఫీ గెలవడమే మా లక్ష్యం. ఈ టోర్నీలో మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. యువ ఆటగాళ్లు ఈ సీజన్ నుంచి చాలా అనుభవాన్ని పొందారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ప్రదర్శన చేస్తారని అశిస్తున్నాను. కొత్త వ్యూహాలు, ప్రణాళికలతో మళ్లీ తిరిగివస్తామని" పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో అయ్యర్ పేర్కొన్నాడు. కాగా ఈ మ్యాచ్‌లో అయ్యర్ కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు.



# ప్రియమైన ప్రత్యర్థిపై ఘనమైన విజయం

**ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహారాపై 11వసారి నెగ్గిన పీవీ సింధు**

**79 నిమిషాల హోరాహోరీ సమరంలో భారత స్టార్‌దే పైచేయి**

**ఇద్దరి మధ్య 20 సార్లు ముఖాముఖి పోరు**

ఆట ఏదైనా కొందరి పోరు చూస్తుంటే ముచ్చటేస్తుంది. చివర్లో విజేతగా ఎవరు అవతరించినా అభిమానులకు మాత్రం పైసా వసూల్ అవుతుంది. మహిళల బ్యాడ్మింటన్ విషయానికొస్తే భారత స్టార్ పీవీ సింధు, జపాన్ ప్లేయర్ నొజోమి ఒకుహారా మధ్య మైదానంలో వైరం ఇప్పటిది కాదు. 2012లో ఆసియా యూత్ అండర్-19 చాంపియన్‌షిప్‌లో వీరిద్దరి మధ్య తొలి పోరు జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ తమ కెరీర్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ సీనియర్ స్థాయిలో చిరస్మరణీయ విజయాలు అందుకున్నారు.

ప్రపంచ చాంపియన్‌గా అవతరించడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లను అందుకున్నారు. ఈ క్రమంలో సింధు, ఒకుహారా మ్యాచ్‌లంటే బాడ్మింటన్ అభిమానులకు పసందైన విందుగా మారిపోయింది. ఒకసారి సింధు గెలిస్తే, మరోసారి ఒకుహారా నెగ్గి లెక్క సరిచేసేది. తాజాగా ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో వీరిద్దరు తొలి రౌండ్‌లోనే ఎదురెదురుగా తలపడ్డారు. ఇద్దరి మధ్య 20వ ముఖాముఖి పోరు ఎప్పటిలాగే ఆద్యంతం అద్భుతంగా సాగింది. 79 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో చివరకు సింధు గెలిచి తన ప్రియమైన ప్రత్యర్థిపై ఆధిపత్యం చాటుకుంది. మ్యాచ్ ముగిశాక ఈ చిరకాల ప్రత్యర్థులు పరస్పరం అభినందించుకోవడంతోపాటు...త్వరలో మరోసారి ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తమ తమ సోషల్ మీడియా ఖాతాల్లో పేర్కొనడం విశేషం.

జకార్తా: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో తొలి అడ్డంకిని అధిగమించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 22-20, 21-23, 21-15తో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహరా (జపాన్)పై అద్భుత విజయం సాధించింది. 79 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సింధు కీలక దశలో పాయింట్లు గెలిచి అనుకున్న ఫలితాన్ని అందుకుంది. సింధు, ఒకుహరా ఇప్పటి వరకు 20 సార్లు అమీతుమీ తలపడగా... అందులో సింధు 11వసారి గెలుపొందింది.

ప్రిక్వార్టర్స్‌లో థాయ్‌లాండ్ ప్లేయర్ పోర్న్‌పవీ చొచువాంగ్‌తో సింధు ఆడనుంది. ఈ ఏడాది అత్యుత్తమంగా ఇండియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధు... ఆ తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక పలు టోర్నమెంట్‌లలో ఆరంభ దశల్లోనే వెనుదిరిగింది. మరోవైపు ఒకు□హారా పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. గత కొంతకాలంగా నిలకడలేమితో ఇబ్బందిపడుతున్న ఈ జపాన్ ప్లేయర్ బరిలోకి దిగిన చివరి ఆరు టోర్నీల్లో రెండో రౌండ్ దాటలేకపోయింది.

'ఇటీవలి కాలంలో ఆరంభ రౌండ్లలోనే పరాజయాలు ఎదురయ్యాయి. అలాంటి దశలో ఈ విజయం చాలా ముఖ్యమైంది. ఒకుహరాతో ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమే. తను అంత తేలికగా పరాజయాన్ని అంగీకరించదు. ఆటలో రోజురోజుకు చాలా మార్పులు వస్తున్నాయి. సుదీర్ఘ ర్యాలీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అటాకింగ్ గేమ్ తగ్గి.. రక్షణాత్మక ధోరణిలో ఆడటం ఎక్కువైంది. ఇక అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఆటకు ఫిట్‌నెస్ కీలకమే. దానిపై మరింత దృష్టి సారించాల్సి ఉంది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తర్వాత స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయా. ఈ నేపథ్యంలో ఈ విజయం నాలో కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఓపికగా ఎదురుచూస్తే లయ అందిపుచ్చుకోవచ్చని నిరూపితమైంది. ఫలితంతో సంతోషంగా ఉన్నా. కానీ ఇంకా చాలా విషయాల్లో మెరుగవ్వాల్సి ఉంది. ముఖ్యంగా గాయాల బారిన పడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నా' అని సింధు మ్యాచ్ అనంతరం పేర్కొంది.

**సాత్విక్–చిరాగ్ జోడీ బోణీ**


పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 67 నిమిషాల్లో 18-21, 21-18, 21-14తో లియో రాలీ కర్నాండో-బాగస్ మౌలానా (ఇండోనేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ 11-21, 22-20, 15-21తో టాప్ సీడ్ షి యూఖీ (చైనా) చేతిలో ఓడాడు.

65 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌లో పరాజయం పాలైన లక్ష్యసేన్... ఆ తర్వాత పుంజుకున్నా... కీలక సమయాల్లో పాయింట్లు గెలిచిన చైనా ప్లేయర్ మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మరో మ్యాచ్‌లో ప్రణయ్ 17-21, 18-21తో ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో ఓటమి పాలయ్యాడు.

పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా)తో జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ (భారత్) 21-16, 16-15తో ఆధిక్యంలో ఉన్న దశలో గాయం కారణంగా వైదొలిగింది. ఇతర మ్యాచ్‌ల్లో అనుపమ (భారత్) 15-21, 9-21తో కిమ్ గా యిన్ (కొరియా) చేతిలో... రక్షిత శ్రీ (భారత్) 21-14, 15-21, 12-21 సుపనిద కటెథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

# అర్జున్‌పై తొలిసారి నెగ్గిన గుకేశ్



**స్టావెంజర్:** గత ఏడాది ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ పాల్గొన్న పలు టోర్నీలలో ఆశించినస్థాయిలో రాణించలేక పోయాడు. అయితే నార్వే ఓపెన్ టోర్నీలో గుకేశ్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతోన్న ఈ టోర్నీలో... గుకేశ్ ఆరో రౌండ్‌లో నార్వే దిగ్గజం, వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి గెలిచాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన ఉత్సాహంలో గుకేశ్ క్లాసికల్ ఫార్మాట్‌లో మరో ప్రత్యర్థిపై తొలిసారి విజయాన్ని అందుకున్నాడు. ఆ ప్రత్యర్థి ఎవరో కాదు భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్. గతంలో అర్జున్‌తో పోటీపడిన ఆరుసార్లు గుకేశ్‌కు విజయం దక్కలేదు. ఒక గేమ్‌లో ఓడిపోయి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. ఏడో ప్రయత్నంలో మాత్రం గుకేశ్ పైచేయి సాధించాడు. మూడున్నర గంటలకుపైగా జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 92 ఎత్తుల్లో అర్జున్‌ను ఓడించాడు. ఈ విజయంతో గుకేశ్ 11.5 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. 12.5 పాయింట్లతో ఫాబియానో కరువానా (అమెరికా) అగ్రస్థానంలో... 11 పాయింట్లతో మాగ్నస్ కార్ల్‌సన్ మూడో స్థానంలో ఉన్నారు. హికారు నకమురా (అమెరికా; 8.5 పాయింట్లు) నాలుగో స్థానంలో, అర్జున్ (7.5 పాయింట్లు) ఐదో స్థానంలో, వె యి (చైనా; 6.5 పాయింట్లు) ఆరో స్థానంలో ఉన్నారు.